## క్లుప్తంగా

### యోగ క్రీడకు మంచి ఆదరణ



విజేతలను అభినందిస్తున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు

కర్నూలు (టౌన్): దేశవ్యాప్తంగా యోగ క్రీడకు మంచి ఆదరణ ఉందని స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు అన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా యోగ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మనుశ్రీ ధనశ్రీ (7 నుంచి 12 సంవత్సరాలు), లావణ్య, కుమారి (12 నుంచి 15 సంవత్సరాలు), అక్షర, పుష్పవతి (15 నుంచి 25 సంవత్సరాలు), ప్రసన్న, లలిత, సుప్రియ( 25 సంవత్సరాలు పైబడిన )లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

### క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ లెవల్ వన్ప్రాథమిక శిక్షణ కోర్సు ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరాన్ని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంచుకున్న క్రీడాంశంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో విలువిద్య కోచ్ భరద్వాజ్, జిల్లా విలువిద్య అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య, సీనియర్ క్రీడాకారుడు వంశీ పాల్గొన్నారు.

### వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



స్టేడియంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు (టౌన్): మహిళలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు, మందులు పంపిణీ చేశారు. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

### రంజాన్ కానుకల పంపిణీ



కానుకలను పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

కర్నూలు(సిటీ): నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత (ఉర్దూ) పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (హైదరాబాద్) వారు శనివారం రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కానుకలో ఫుడ్ గ్రెస్ట్ కిట్స్, తల్లిదండ్రులు లేని పిల్లలకు నూతన వస్త్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి మహమ్మద్ ఇర్ఫానుద్దీన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. పేదరికం అభివృద్ధికి అవరోధం కాకూడదన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్‌ఎం ఎస్.పుష్పరాజ్, ఉపాధ్యాయులు, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### 14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సి.బెళగల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఈనెల 14న పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీవార్మింగ్ డే నిర్వహణపై ఆరోగ్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

### సాక్షి సినిమాలు

**ఎస్‌వీసీ కాంప్లెక్స్:** పఠాన్, బలగం, తూ జూఠీ మై మక్కర్, 65
**వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్:** ఆర్ఆర్ఆర్, సార్, బలగం, 65, మిస్టర్ కల్యాణ్, నేడు విడుదల, దోచేవారెవరురా
**వెంకటేష్ సినీ కాంప్లెక్స్:** సర్, వినరో భాగ్యము విష్ణు కథ
**ఐనాక్స్ :** తూ జూఠీ మై మక్కర్, క్రీడ్-3, 65,సీఎస్ఐ సనతాన్,ట్యాక్సి, స్కీమ్ 6
**భరత్ కాంప్లెక్స్ :** పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వాల్తేర్ వీరయ్య
**రాజ్ :** సీఎస్ఐ సనతాన్
**శ్రీరామ :** సింహ
**విజయ :** పులి ది నైన్‌టీన్త్ సెంచరీ

# జలకాలాట.. పతకాల వేట

- ఈత పోటీల్లో రాణిస్తున్న కర్నూలు స్విమ్మర్లు
- ప్రతిభకు వేదికగా నిలుస్తున్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్



స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్‌లో సాధన చేస్తున్న స్విమ్మర్లు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరానికి చెందిన స్విమ్మర్లు ఈత పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. ఈత కొలనులో దిగితే పతకాల వేట సాగిస్తున్నారు. స్విమ్మింగ్‌లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11, 12 తేదీలలో విజయవాడలోని ఈడుపుగల్లులో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌పూల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా కర్నూలు పట్టణానికి చెందిన నలుగురు స్విమ్మర్లు సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్(ఈత కొలను) ప్రతిభకు వేదికగా నిలుస్తోంది. 1973 సంవత్సరం ఏర్పాటు అయిన ఈ స్విమ్మింగ్‌పూల్ ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దింది. అదేవిధంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. ఫ్రీస్టైయిల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్‌స్ట్రోక్, బట్టర్ ఫ్లై వంటి క్రీడాంశాల్లో జిల్లా నుంచి పదుల సంఖ్యలో స్విమ్మర్లు పతకాలు సాధించారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా వల్ల స్తబ్దత నెలకొన్న క్రీడారంగం ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఊపందుకుంది. శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రీడల నిర్వహణను చేపడుతున్నారు. నూతన క్రీడా పాలసీ వల్ల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల వైపు మొగ్గు చూపుతున్నారు.

#### రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాట



నేను ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాను. అండర్ -17 విభాగంలో 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైయిల్ పోటీల్లో బంగారు పతకం సాధించా. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించడమే నా లక్ష్యం.

– దేవ శృతి సాయి

#### స్విమ్మింగ్‌పూల్‌లో అన్ని సౌకర్యాలు

కర్నూలు నగరంలో స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. శిక్షకులు, పర్యవేక్షకులు ఉన్నారు. ఎంతో మంది స్విమ్మర్లు ఇక్కడ నుండే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఇటీవల స్విమ్మింగ్ పట్ల చిన్నారులు, వారి తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరిగింది. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోంది.

–నటరాజరావు, స్విమ్మింగ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్

#### మరిన్ని పతకాలు సాధిస్తా



నేను మాంటిస్సోరి పాఠశాలలో 7వ చదువుకుంటున్నా. తల్లిదండ్రుల సహకారంతో స్విమ్మింగ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నా. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ -14 విభాగం 100 మీటర్ల ఫ్రీస్టైయిల్ పోటీల్లో బంగారు పతకం సాధించా. ఇదే ఉత్సాహంతో ప్రాక్టీస్ చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తా. -కె. శృతి

#### చదువుకుంటూనే స్విమ్మింగ్ ప్రాక్టీస్



వ్యక్తిగత క్రీడల్లో రాణించాలని ఉంది. అందుకే స్విమ్మింగ్‌ను ఎంచుకున్నా. నేను నగరంలోని వడ్డగేరిలో నివసిస్తున్నా. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్నా. చదువుకుంటూనే నిత్యం స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్నా. ఇంట్లో వాళ్ల ప్రోత్సహంతో రాష్ట్రస్థాయి అండర్ -17 విభాగం 200 మీటర్ల బట్టర్ ఫ్లై పోటీల్లో బంగారు పతకం సాధించా. -సామియా టాంజీన్

### మానసిక ఒత్తిడికి గురి కాకూడదు

కర్నూలు సిటీ: పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకూడదని రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, అకాడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, గణిత శాస్త్ర నిపుణులు ఈశ్వరయ్యలు అన్నారు. శనివారం రవీంద్ర విద్యా సంస్థల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పాజిటివ్ ఆలోచనలతో ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలకు దూరంగా ఉండాలని, చదివిన అంశాలను చక్కగా రాయడంతో మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### 15న మహిళా ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ మార్చి 15వ తేదీన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళా ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ తెలిపారు. శనివారం కారిృక, కర్షక భవన్‌లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, చేతివృత్తిదారుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల హక్కుల సాధన కోసం 15న జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు చెప్పారు. కావున పెద్ద ఎత్తున మహిళలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అలివేలు, ఎండీ అంజిబాబు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదవాలి

- రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ విధులకు హాజరయ్యే అధికారులకు శనివారం ఉద్యాన్‌భవన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల మాన్యువల్‌ను చదివి అర్థం చేసుకొని కౌంటింగ్ చేపట్టాలన్నారు. అప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలన్నారు. తర్వాత బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కట్టి పోలింగ్ స్టేషన్ల వారీగా డ్రమ్ము ఇన్‌చార్జ్‌కి అప్పగించాలన్నారు. అనంతరం అభ్యర్థుల వారీగా ఓట్లను లెక్కించాలన్నారు. కాగా మాస్టర్ ట్రైన్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి 14వ తేదీన మరోసారి శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 14న 'ఇమాం ఏ ఆజం అబూ హనీఫా'

- సర్వమానవాళి శాంతి కోసం కాన్ఫరెన్స్‌లు



మాట్లాడుతున్న సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ

కర్నూలు(రాజ్‌విహార్): ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై ఈ నెల 14వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని ఆ సంఘం కార్యాలయం మిలాద్ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమానవాళిని శాంతి వైపు నడిపేందుకు కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అహలే సున్నతుల్ జమాత్, సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు (మగ్రీబ్ నమాజు తరువాత) బుధవారపేట బ్రిడ్జి వద్ద ఉన్న ఎంఎస్ ఫంక్షన్ హాలులో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జామియా నిజామియా నక్షబంది, ఖతీబే హిందుస్తాన్ అల్లమా మౌలానా మొహమ్మద్ అహ్మద్, ప్రముఖ మత గురువు మౌలానా ఆసిఫుద్దీన్ ఖాద్రీ హాజరై ప్రసంగించనున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఈ సభకు హాజరై ఆధ్యాత్మికతను పెంపొందించుకొని అల్లాహ్ మార్గంలో నడుచుకోవాలని కోరారు. సమావేశంలో రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ, అహలే సున్నతుల్ జమాత్ కమిటీ ప్రతినిధి సయ్యద్‌మాసుం పీర్ ఖాద్రీ, మహబూబ్ బాషా, మొహమ్మద్ జుబేర్ ఖాద్రీ, నజీర్ ఖాద్రీ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా..

### లక్ష్మీమాధవుడి గజత్సోవం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్ల గజత్సోవం, శిభికోత్సవ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను గజవాహనంపై ఆశీనులు చేసి డప్పుచప్పుళ్లు, మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గజవాహనానికి ముందు గోరంట్ల వాసులు, వెనుక ఎర్రగుడి వాసులు నిలబడి పోటా పోటీగా స్వామి వారి గజత్సోవ కార్యక్రమాన్ని ఎంతో కోలాహలంగా నిర్వహించారు.



గోరంట్లలో శ్రీలక్ష్మీమాధవుడి గజత్సోవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

## భక్తిశ్రద్ధలతో...

### ఖాజాహుసేన్ గంధోత్సవం



ఊరేగింపుగా గంధం తీసుకెళుతున్న దృశ్యం

కోడుమూరు రూరల్: వర్కూరులో శ్రీసద్గురు ఖాజా హుసేన్ దాస్ దర్గా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెలవారుజామున భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, గొరవయ్య నృత్యాలు, ఫకీర్ల విన్యాసాల మధ్య పీఠాధిపతి సద్గురు ఖాజా సుభాహాన్ హుసేన్‌దాస్ ఇంటి నుంచి దర్గా వరకు ఈ కార్యక్రమం సాగింది. మధ్యాహ్నం దర్గాకు విచ్చేసిన భక్తులకు స్వామి వారి శిష్య బృందం అన్నదానం నిర్వహించింది.

## ధర్మ రక్షా కేంద్రాలు దేవాలయాలు

కర్నూలు కల్చరల్: ధర్మ రక్షా కేంద్రాలు దేవాలయాలని స్వామి శివరామానంద సరస్వతి అన్నారు. శనివారం ఆయన నగర శివారులోని శ్రీ గోదా గోకులంలో వెలసిన శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీ రంగనాథ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ శ్రీరంగాన్ని తలపిస్తున్న ఈ క్షేత్రం అచిర కాలంలోనే గొప్ప ఖ్యాతిని పొందుతుందన్నారు. ఆధ్యాత్మిక సంపదకు ఏదీ సాటిరాదన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక చైర్మన్ మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి, వేద పండితులు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.



గోదా గోకులంలో స్వామి శివరామానంద సరస్వతి, ట్రస్ట్ సభ్యులు

## మండలి ఎన్నికల్లో భారీ విజయం ఖాయం

- ఓటమి భయంతోనే టీడీపీ తప్పుడు ఆరోపణలు
- సీపీఐ నేత రామకృష్ణ పచ్చ కండువా కప్పుకోవాలి
- విలేకరుల సమావేశంలో బీవై రామయ్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో పోటీ చేసే మూడు స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులకు భారీ విజయం ఖాయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య ధీమా వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే తప్పుడు ఆరోపణలు చేయడంతోపాటు పార్టీ పేరుతో కూడా పోటీ చేయడంలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 120 ఓట్లు లేకపోయినా ఆ పార్టీ ఇద్దరిని బరిలోకి దించిందని, ఆ ఓట్లు కూడా పడవనే ఆందోళనలో ఉందన్నారు. సీపీఐ నేత రామకృష్ణకు టీడీపీకి వంత పాడడం తప్ప ఇతర ఆలోచన లేదన్నారు. గతంలో వామపక్ష పార్టీలు ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసేవని, ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, పాస్ బుక్కులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు.. ఇలాంటివి మంజూరు కోసం ఆందోళనలు చేపట్టేవారన్నారు. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతీది మంజూరు చేస్తూ వామపక్షాలకు పని లేకుండా చేశారన్నారు. అయితే రామకృష్ణ మాత్రం ప్రజా సంక్షేమ పాలనను సమర్థించకపోగా విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు ఆశయాల కోసం పనిచేసే ఆయన కమ్యూనిస్టుల విలువలు పోగొడుతున్నారని, ఎర్ర జెండా వదిలి పచ్చ జెండా కప్పుకోవాలని సూచించారు. రూ.1.95 లక్షల కోట్లు ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి సంక్షేమ పథకాల కింద జమ చేసిన ఘనత సీఎం జగన్‌దేనని, అలాంటి వ్యక్తి సిఫార్సు చేసిన వాళ్లకే ప్రజలు ఓట్లు వేస్తున్నారన్నారు. ఇటీవలే విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు హాజరై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా అంబానీ సైతం హాజరయ్యారని చెప్పారు. దీని వల్ల రాష్ట్రంలో 6.09లక్షల ఉద్యోగాలు రానున్నాయని, యువతను దృష్టిలో పెట్టుకొని, నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకే ఈ ఒప్పందాలు చేసుకున్నట్లు వెల్లడించారు. మండలి అభ్యర్థులు డాక్టర్ ఎ.మధుసూదన్ (స్థానిక సంస్థలు), వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రులు), రామచంద్రారెడ్డి (టీచర్స్)ను ఆయన వర్గాల ఓటర్లు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఏ ఎన్నిక జరిగినా వైఎస్ఆర్‌సీపీదే విజయం అవుతుందని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు బెల్లం మహేశ్వరరెడ్డి, గోపాల్ రెడ్డి, ధనుంజయ ఆచారి, సత్యం యాదవ్, లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

### పీడీపీ ఉద్యోగుల నిరసన

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణ శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజు శనివారం కూడా కొనసాగింది. కర్నూలు–2డిపో ముందు ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి తమ ఓటీని వెంటనే చెల్లించాలని కోరారు.

### సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ఎగువ నుంచి 710 క్యూసెక్కుల నీరు చేరింది. కేసీ కాల్వకు 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.719 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### పోలింగ్ కేంద్రం పరిశీలన

గడివేముల: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలో 942 మంది పట్టభద్రులు, 43మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ చెప్పారు.

### స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి

ఓర్వకల్లు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యమిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శనివారం మండల కేంద్రం పొదుపు భవన్‌లో ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. మండల కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఓర్వకల్లు ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇక్కడ అనేక పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మండల కార్యదర్శిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా మహబూబ్‌బాషా, మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పురుగుల నియంత్రణలో పక్షులు కీలకం



ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన పరీక్షను పరిశీలిస్తున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, చీడపీడల నియంత్రణలో పక్షులు కీలకమని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు పక్షుల వల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. పంటల్లో పురుగుల బెడదను నివారించుకునేందుకు కర్రలతో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసి పొలంలో పసుపు కలిపిన అన్నం, బొరుగులు చల్లాలని తెలిపారు. కర్రలపై వాలిన పక్షులు నేలపై చల్లిన అన్నం, బొరుగులు తినేందుకు వెళ్లి పురుగులను కూడా తినేస్తాయన్నారు. పంటలు కంకిదశ, కాయదశలో ఉన్నపుడు పక్షుల వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఒకే పొలంపై ఎక్కువ సంఖ్యలో పక్షులు వాలి గింజలు తినడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అటువంటి సమయంలో పక్షుల బెడదను తగ్గించుకునేందుకు చనిపోయిన పక్షులను పొలంలో వేలాడదీయడం, మెటాలిక్ రిబ్బన్‌లు ఏర్పాటు చేయడం, టేపు రికార్డులతో సౌండ్ చేయడం, దిష్టి బొమ్మలు పెట్టడం చేయాలన్నారు. కంకులు, కాయలపై వేపనూనె పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కాగా ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై మధ్యంతర పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో దేశీ కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. కర్నూలు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో మోటర్ వాహన చట్టం ఉల్లంఘనపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్‌విహార్ సెంటర్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా తిరుగుతున్న 35 మంది మైనర్లపై కేసు నమోదు చేసి రూ.53,720 జరిమానా విధించారు. సాయంత్రం పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలను ఉదాహరణలతో డీఎస్పీ వివరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులకు చట్టాల ప్రకారం రూ.25 వేలు జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే మైనర్లకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా ఉంటుందన్నారు.

## 'రన్ ఫర్ జీసస్' విజయవంతం చేయండి




పోస్టర్‌ను ఆవిష్కరించిన కమిటీ నాయకులు

కర్నూలు (టౌన్): వచ్చే ఏప్రిల్ 8వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్నూలు సిటీ పాస్టర్ల సంఘం కమిటీ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సజీవరాజు, ఫాదర్ అంథోని రాజులు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో రన్ ఫర్ జీసస్ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ప్రతి ఏడాది రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రన్‌ను ఆర్‌సీఎం చర్చి నుంచి ప్రారంభించి సి.క్యాంపు ప్రార్థన మందిరం వరకు కొనసాగుతుందన్నారు. యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు దాసరి సుధీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.